ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు



బుధవారం 1 అక్టోబరు 2025

ఒక కుటుంబం..

● డీఎస్సీలో ఇద్దరు, ముగ్గురికి టీచర్ ఉద్యోగాలు ● ఆనందంలో కుటుంబ సభ్యులు

డబుల్ ధమాకా..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న వారి కలలు కూటమి ప్రభుత్వంలో సాకారమయ్యాయి. ఈ ఏడాది ఉపాధ్యాయ పోస్టులలో ఒకే కుటుంబంలోని భార్యాభర్తలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు ఇలా ఇద్దరు, ముగ్గురికి పోస్టులు రావడంతో ఆ కుటుంబాల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఇటీవల డీఎస్సీ నియామకపత్రాలు తీసుకున్న వారికి అక్టోబరు 3వ తేదీ నుంచి శిక్షణ ఇవ్వనున్నారు. అదేనెల 13వ తేదీ ఉపాధ్యాయులుగా పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఒకే కుటుంబంలో ఉపాధ్యాయ పోస్టులు సాధించిన వారిని పలువురు అభినందిస్తున్నారు.



మదనపల్లెలో లక్ష్మీదేవి, కరుణాకర్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

● రామసముద్రం మండలం మినికి పంచాయతీ గుంతవారిపల్లెకు చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించారు. తల్లి జానకమ్మ, తండ్రి శంకరప్పకు నలుగురు సంతానం. అందులో ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు. రోజు వారీ కూలి పనులు చేసుకుంటూ పిల్లల చదువే ఆస్తిగా భావించి చదివించారు. పెద్ద కూతురు సునంద 2016లో ఎస్జీటీగా ఎంపికైంది. ఈమె తన ఇద్దరు చెల్లెళ్లకు సలహాలు, సూచనలు ఇవ్వడంతో మీనాక్షి, మధులత 2025 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించారు. డబ్బు, పలుకుబడి ఉన్న వారికే ఉన్నత చదువులు, ఉద్యోగాలు వస్తాయన్న అపోహలను దూరం చేస్తూ నిరుపేద కుటుంబంలో ముగ్గురు కూతుళ్లు ప్రభుత్వ ఉద్యోగులుగా ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అక్కాచెల్లెళ్లు స్పందిస్తూ తాము ఈ స్థాయికి రావడానికి తమ మేనమామ, టీచర్ నారాయణప్ప మార్గనిర్దేశం కారణమని ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.



ఉపాధ్యాయులుగా ఎంపికైన అక్కాచెల్లెళ్లు తోటి మధులత, తోటి సునంద, తోటి మీనాక్షి



తల్లిదండ్రులతో ఉపాధ్యాయులుగా ఎంపికైన అక్కాచెల్లెళ్లు



సి.లక్ష్మీదేవి, సి.కరుణాకర్

● కలకడ మండలం తిప్పిగారి పల్లెకు చెందిన చామంచుల సిద్దయ్య కుమారుడు కరుణాకర్ వ్యవసాయ కుటుంబంలో జన్మించి ప్రాథమిక విద్య సొంతూరులోని ప్రాథమిక పాఠశాలలో పూర్తి చేశాడు. 6 నుంచి 10వ తరగతి వరకు కోన జిల్లా పరిషత్ హైస్కూల్, ఇంటర్మీడియట్ కలకడ జూనియర్ కళాశాలలో, డిగ్రీ మదనపల్లె బీటీ కళాశాలలో చదివాడు. ఆదర్శ పాఠశాలలో కాంట్రాక్టు ఉద్యోగం చేస్తున్నాడు. సొంతంగా ప్రిపేర్ అయి 2025 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఉద్యోగం సాధించారు. ఈయన భార్య బడికల లక్ష్మీదేవి పులిచెర్ల మండలం కురవపల్లెలో జన్మించి 10వ తరగతి వరకు పులిచెర్లలో, పీలేరులో డిగ్రీ చదివింది. వివాహం చేసుకుని గృహిణిగా ఉంటూనే తన సోదరుడు ఐఆర్ఎస్ అధికారి బడికల యాదగిరి సలహాలు, సూచనలతో విశాఖపట్నంలో రెండు నెలల పాటు కోచింగ్ తీసుకుంది. తర్వాత భార్యాభర్తలు ఇద్దరూ ఇంటి దగ్గరే ప్రిపేర్ అయి ఆమె కూడా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఉద్యోగం సాధించారు. భార్యాభర్తలు ఇద్దరూ ఒకే డీఎస్సీలో, ఒకే విభాగంలో ఉద్యోగం సాధించడం విశేషం.



తల్లిదండ్రులతో పంటా రంగనాథ్, పంటా సుబ్రహ్మణ్యం

● ఓబులవారిపల్లె మండలం చిన్నవరం పాడు గ్రామ పంచాయతీ జెడ్‌హెచ్‌డీసీ కాలనీకి చెందిన వ్యవసాయ కుటుంబమైన పంట రంగయ్య, రామసుబ్బమ్మ దంపతులకు నలుగురు సంతానం. అందులో చివరి ఇద్దరు అన్నదమ్ములు పంట రంగనాథ్, పంట సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు, అన్నదమ్ముల సహకారంతో ఉన్నత విద్యనభ్యసించి ఎటువంటి కోచింగ్ లేకుండా సొంతంగా చదువుకుని డీఎస్సీలో ఉపాధ్యాయ కొలువులు సాధించారు. పంట రంగనాథ్ ఎస్జీటీ ఉద్యోగం సాధించారు. ఇతను ఎంఎస్సీ, ఎంఈడీ చదివారు. పదో తరగతి వరకు జెడ్పీ హైస్కూల్ చిన్నఓరంపాడు, ఇంటర్మీడియట్ ఏపీఎస్‌డబ్ల్యుఆర్ గురుకుల పాఠశాల సంజీవపురం, రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివారు. రాజంపేటలో డీఈడీ, ఎంఈడీ చదివారు. డీఎస్సీకి ఆన్‌లైన్‌లో సాధన చేసి ఉపాధ్యాయ పోస్టు సాధించాడు. పంట సుబ్రహ్మణ్యం ఎంఏ, బీఈడీ చదివారు. 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు ఓబులవారిపల్లె ఏపీఎస్‌డబ్ల్యుఆర్ స్కూల్‌లో, కడప ఆర్ట్స్ కాలేజ్‌లో డిగ్రీ, తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో పీజీ చేశారు. రైల్వేకోడూరులో బీఈడి పూర్తి చేశారు. కర్నాటక రాష్ట్రం చింతామణిలో ఆర్కే జూనియర్ కాలేజ్‌లో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తూ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాడు.

● పెద్ద తిప్పసముద్రం మండలం కమ్మచెరువు పంచాయతీకి ముక్కెర అలివేలమ్మ, నారాయణ, తలారి ఈశ్వరయ్య, గంగులప్ప దంపతుల కుమారులు నవీన్‌కుమార్, విష్ణువర్ధన్‌లు బావబామ్మర్దులు. వీరు చిన్నప్పటి నుంచి కమ్మచెరువు ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. ఇంటర్మీడియట్ బి.కొత్తకోటలోని ప్రభుత్వ కళాశాలలో చదివారు. వీరిద్దరూ డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు సాధించారు. నవీన్ కుమార్ 84.5 మార్కులు సాధించగా విష్ణువర్ధన్ 71.5 మార్కులు సాధించారు. ఒకే కుటుంబం నుంచి తమ పిల్లలు ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో ఆ కుటుంబాల్లో ఆనందానికి అవధులు లేవు



నవీన్‌కుమార్, విష్ణువర్ధన్

కడప, అన్నమయ్య జిల్లాల మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వేర్వేరు ప్రాంతాలకు నాలుగు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక రైళ్లు షోలాపూర్-ధర్మవరం, మధ్య నడుస్తాయని వివరించారు. అక్టోబరు 2 (గురువారం) షోలాపూర్-ధర్మవరం (01437) రైలు, అక్టోబరు 4 (శనివారం) ధర్మవరం-షోలాపూర్ (01438) ప్రత్యేక రైళ్లు వచ్చి వెళ్లేప్పుడు కుర్దువాడి, బర్షిటౌన్, ధారశివ్, లాతూర్, లాతూర్ రోడ్, ఉద్గీర్, భాల్కి, బీదర్, వికారాబాద్, యాద్గిర్, కృష్ణా, రాయచూర్ మంత్రాలయం రోడ్, ఆదోని, గుంతకల్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి రోడ్, ములకలచెరువు, కదిరి స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు.

దసరాను ప్రశాంతంగా జరుపుకోవాలి

● ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



రాయచోటిటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయదశమి పండుగ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో సురక్షితంగా జరుపుకోవాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం జిల్లా ప్రజలకు, ఉత్సవ నిర్వాహకులకు భద్రతా సూచనలు జారీ చేశారు. విజయదశమి ఉత్సవ ఊరేగింపుల సమయంలో శాంతియుతంగా ఉండాలన్నారు. ఊరేగింపు సందర్భంగా తోపులాటలు, అల్లర్లు, ప్రమాదకర చర్యలు చేయకూడదన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు గానీ, వస్తువులు గానీ కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే 112 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. ఉత్సవ నిర్వాహకులు ఊరేగింపు మార్గాలను ముందుగానే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసి ప్రజలకు తెలియజేయాలన్నారు. పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. శబ్ధ పరికరాలు అనుమతించిన స్థాయిలోనే వినియోగించాలని, మద్యపానం, కత్తులు, కర్రలు, ఇతర ప్రమాదకర వస్తువులు పూర్తిగా నిషేధం అని తెలిపారు. ప్రతి పట్టణం, గ్రామంలో ఊరేగింపు మార్గాలపై ప్రత్యేక పోలీసు పహారా ఉంటుందన్నారు. విజయదశమి పండుగ మన సంస్కృతి, ఐక్యత, ఆనందానికి ప్రతీక అన్నారు. ఈ పండుగను అందరూ సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఈ విజయదశమిని నిజమైన ఆనందోత్సవంగా మార్చుకోవాలని ఎస్పీ ప్రజలకు పిలుపునిచ్చారు.

నేటి నుంచి పోస్టల్ స్పీడ్
● రిజిస్టర్ పోస్ట్‌లకు చెల్లు
● ఓటీపీ బట్వాడాలతో భరోసా 4

పేదలకు అండ సీఎం సహాయనిధి

● రాయచోటి నియోజకవర్గంలో రూ.5.32 కోట్లు పంపిణీ
● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి (నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదవాడి ఆరోగ్యానికి కొండంత అండ సీఎం సహాయనిధి అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం 92 మంది అనారోగ్య బాధితులకు రూ.72 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల ఆరోగ్యమే లక్ష్యంగా కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతో సీఎం సహాయనిధి ద్వారా అనారోగ్య బాధితులను ఆదుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో ఎప్పుడూ లేని విధంగా 12 నెలల్లో 5 కోట్ల 32 లక్షల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించినట్లు తెలిపారు. ఈ ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని తెలియజేశారు. నిరుపేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అర్చనా విద్యా సంస్థల అధినేత మదన్‌మోహన్‌రెడ్డి, రాయచోటి మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి, కుప్పం ఎన్నికల పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ కొండా భాస్కర్‌రెడ్డి, దేవపట్ల సింగిల్‌విండో అధ్యక్షుడు కోటేశ్వర్‌రెడ్డి, కడప డీసీసీబీ మాజీ మెంబర్లు మల్లు విష్ణువర్ధన్‌రెడ్డి, వివిధ మండలాలకు చెందిన టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జయ..జయహే..మహిషాసురమర్దిని

● వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ● మహిషాసురమర్దినిగా అమ్మవారు



మహిషాసురమర్దినిగా రాజంపేట వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి




రాయచోటి వీరభద్రాలయంలో మహిషాసురమర్దిని అలంకారంలో భద్రకాళి అమ్మవారు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పలు ఆలయాల్లో 9వ రోజు మంగళవారం అమ్మవారు మహిషాసుర మర్దిని, దుర్గాదేవి అలంకారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దుర్గాష్టమి సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీలేరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో, గుర్రంకొండలోని రెడ్డెమ్మ తల్లి దుర్గాదేవి అలంకారంలో దర్శనం ఇచ్చారు. రాజంపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకారంలో, మదనపల్లెలోని కన్యకాపరమేశ్వరిదేవి, కోర్టులో గంగమ్మ, సోమేశ్వరస్వామి ఆలయాల్లో మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. నిమ్మనపల్లెలోని మాతమ్మ ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. రూ.5 లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు ఆలయానికి తరలివెళ్లారు.



మదనపల్లె సోమేశ్వరస్వామి ఆలయంలో మహిషాసురమర్దిని అలంకారం



దుర్గాదేవి అలంకరణలో రెడ్డెమ్మ అమ్మవారు



మదనపల్లె కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మహిషాసుర మర్దిని అలంకారం



మదనపల్లె కోర్టులో గంగమ్మ ఆలయంలో మహిషాసుర మర్దిని అలంకారం



దుర్గాదేవి అలంకరణలో పీలేరు వాసవీ కన్యకా పరమేశ్వరి

బాహుదా దశ మారేనా...?

● ప్రాజెక్టు ఉన్నా నీరు పారే దారేది..
● కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు పంచాయతీలో గల బాహుదా ప్రాజెక్టు దశ మారనుంది. గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు గురించి పట్టించుకోకపోవడంతో కాలువల్లో పిచ్చిమొక్కలు మొలిచి నీరు పారే దారి లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. కాలువల మరమ్మతులకు రూ.1.37 కోట్లతో ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే మరమ్మతులు చేపట్టి కాలువల ద్వారా నీరు పారించనున్నారు. 1966లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి హయాంలో రెండు కొండల మధ్య రూ.63.53 లక్షలతో బాహుదా రిజర్వాయర్‌ను నిర్మించారు. బాహుదా కెపాసిటీ 398 ఎంసీఎఫ్‌టీ. బాహుదా కింద రెండు సప్లయ్ ఛానల్స్, 26 స్ప్రింగ్ ఛానల్స్ నిర్మించింది. కాగా అప్పటి నుంచి తాగు, సాగునీటికి కొరత లేకుండా దాదాపు మూడు మండలాలకు నీటి అందించేది. ఈ ప్రాజెక్టు కింద 3 వేల ఎకరాలకు పైగా పంటలు సాగవుతాయి. అయితే కాలం గడిచేకొద్దీ కాలువలు పూడిపోయి ప్రాజెక్టులో నీరు ఉన్నా పంట పొలాలకు వెళ్లకుండా గండ్లు పడ్డాయి. పలు మార్లు రైతులే గండ్లు పూడ్చుకుని మరమ్మతులు చేసుకున్నా ఫలితం లేకపోయింది. అయితే రైతుల అవస్థలను చూసినా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం దాదాపు రూ.200 కోట్లు మంజూరు చేసింది. పనులు చేసిన కాంట్రాక్టర్లు వారికి ఇష్టం వచ్చినట్లు కాలువలు నిర్మించడంతో ఆ కాలువలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ప్రస్తుతం బాహుదా నిండినా కాలువలు సక్రమంగా లేక నీరు రాకపోవడంతో రైతులకు నిరాశే ఎదురవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని ప్రాజెక్టులకు మరమ్మతులు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇవ్వడంతో ప్రస్తుతం రైతుల ఆశలు చిగురించాయి.



నిమ్మనపల్లెలోని బాహుదా ప్రాజెక్టు

కుడి కాలువకు రూ.1.37 కోట్లతో ప్రతిపాదనలు

బాహుదా ప్రాజెక్టు కుడికాలువ దాదాపు 7.5 కిలోమీటర్లు ఉంది. కాలువల మరమ్మతులకు రూ.1.37 కోట్లకు ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీహరి రెడ్డి తెలిపారు. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



పిచ్చి మొక్కలతో నిండిపోయిన కుడి కాలువ

నేటి నుంచి పోస్టల్ స్పీడ్

- రిజిస్టర్ పోస్ట్‌లకు చెల్లు
- ఓటీపీ బట్వాడాలతో భరోసా



పీలేరు సబ్ పోస్ట్ ఆఫీసు భవనం



స్పీడ్ పోస్టు, రిజిస్టర్ పోస్టుల కార్డులు

కలికిరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి సాంప్రదాయ విధానాలతో వెనుకబడ్డ పోస్టల్ శాఖ ఆధునిక సాంకేతిక పోకడలతో ముందుకెళ్లేందుకు అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే 150 ఏళ్ల క్రితం బ్రిటీషు కాలంలో ప్రవేశపెట్టిన రిజిస్టరు పోస్ట్ విధానాన్ని పూర్తిగా సంస్కరిస్తూ తాజాగా స్పీడ్‌పోస్ట్ విధానంలోకి విలీనం చేస్తోంది. ఫలితంగా బుధవారం నుంచి రిజిస్టరు పోస్ట్‌ను ఉపసంహరించుకుంటోంది. దీంతో పాటు 1960లో ప్రవేశపెట్టి ఇప్పటివరకూ కొనసాగిస్తున్న 'రిజిష్టర్ పోస్ట్ అక్నాలెడ్జ్‌మెంట్ డ్యూ' (ఆర్‌పీఏడీ)కి కూడా మంగళం పలకనుంది. అయితే దీనికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుతమున్న స్పీడ్ పోస్ట్‌కే మరింత మెరుగులు దిద్ది కొత్త సాంకేతిక డిజిటల్ విధానానికి మళ్లిస్తోంది. 1986 ఆగస్టు 1 నుంచి తపాలా శాఖ స్పీడ్ పోస్ట్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. 'ఎక్కడికైనా.. ఎవరికైనా.. ఎప్పు డైనా' అన్న నినాదంతో గత విధానాలకన్నా మెరుగనిపించింది. ప్రస్తుత మున్న ఆర్‌పీఏడీ విధానాన్ని స్పీడ్ పోస్టుకు కూడా కొనసాగించనుంది.

డిజిటల్ డెలివరీలోకి స్పీడ్ పోస్ట్

స్పీడ్ పోస్ట్ ద్వారా ప్రస్తుతమున్న డెలివరీ విధానాన్ని డిజిటల్ పరిజ్ఞానంలోకి మార్చుతోంది. ప్రస్తుతం స్పీడ్ పోస్టు ఉత్తరాలను ఏదో మొక్కుబడిగా చేరుస్తు న్నారు. న్యాయ పరమైన, చట్టపరమైన నోటీసులకు డెలివరీ విధానంలో ఖచ్చితత్వం లేక పోవడంతో స్పీడ్ పోస్టు అంతగా ప్రాచుర్యం సాధించలేక పోయింది. దీని కన్నా రిజిస్టరు పోస్ట్‌కే ప్రజలు మొగ్గు చూపేవారు. అయితే ప్రస్తుతం స్పీడ్ పోస్ట్ డెలివరీలో ఓటీపీ విధానాన్ని తీసుకొస్తున్నారు. పలాన వ్యక్తికి చేరాల్సిన ఉత్తరాన్ని అతని వద్దకెళ్లి అతని ఫోన్‌కు వచ్చిన ఓటీపీని చెపితేనే డెలివరీ చేయ నున్నారు. దీంతో చేరాల్సిన వ్యక్తికే చేరిందనే విషయం నిర్ధారణ అవు తుంది. దీనికి తోడుగా స్పీడ్ పోస్టుకు కూడా అక్నాలెడ్జ్‌మెంట్ డ్యూ విధానాన్ని అమలు చేస్తున్నారు. అదనంగా రూ.5 చెల్లిస్తే అక్నాలెడ్జ్‌మెంట్ కూడా జత చేసిన దాన్ని చేర్చినట్లు తిరుగు టపాలో రుజువు అందజేస్తారు.

జిల్లాలోని పోస్ట్ ఆఫీసులు

జిల్లాలో ప్రస్తుతం ఐదు సబ్ డివిజన్లున్నాయి. వాయల్పాడు, పీలేరు, మదనపల్లె, రాయ చోటిలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో ఈ ఎస్డీవో కార్యాలయాలు పనిచేస్తున్నాయి. వీటి పరిధిలో మొత్తం 46 సబ్ పోస్ట్ ఆఫీసులు, వాటి పరిధిలో 386 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు న్నాయి. వాయల్పాడు ఎస్డీవో పరిధిలో 9 సబ్ పోస్ట్ ఆఫీసులు, 66 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు, పీలేరు పరిధిలో 9 సబ్ పోస్ట్ ఆఫీసులు, 68 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు, మదనపల్లె పరిధిలో 8 సబ్ పోస్ట్ ఆఫీసులు, 72 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు, రాయచోటి పరిధిలో 9 సబ్ పోస్ట్‌ఆఫీసులు, 88 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు, రాజంపేట పరిధిలో 11 సబ్ పోస్ట్ ఆఫీసులు, 92 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు పని చేస్తున్నాయి. ఇవి కాకుండా అర్బన్ ప్రాంతాల్లో టీఎస్‌ఓ కార్యాలయాలు న్నాయి. ఒక్కో సబ్ పోస్ట్ ఆఫీసు ద్వారా ప్రతి రోజూ వంద నుంచి 200 వరకూ రిజిస్టర్ పోస్టులు నమోదవుతున్నాయి.

స్పీడ్ పోస్టు కొత్త ధరలు

స్పీడ్ పోస్టు కవరు బరువు, చేరాల్సిన దూరాన్ని బట్టి ధరలను నిర్ణయించారు. 50 గ్రాముల నుంచి 500 గ్రాముల వరకూ స్థానికంగా లేక రెండు వేల కి.మీ. దూరం పైబడి కూడా వివిధ రకాల దూరాన్ని బట్టి రూ.19 నుంచి గరిష్టంగా రూ.93 వరకూ చెల్లించాల్సి వుంటుంది. దీనికి జీఎస్టీ అదనం. ఉదాహర ణకు 250 నుంచి 500 గ్రా. బరువున్న కవరుకు స్థానికంగా అయితే రూ.28 చెల్లిం చాలి. అదే కవరు 200 కి.మి. వరకూ రూ.70, 500 కి.మీ వరకూ రూ.75, వేయి కి.మీ వరకూ రూ.82, రెండు వేల కి.మీ వరకూ రూ.86, అది దాటితే రూ.93లు మాత్రమే చెల్లించాల్సి వుంటుంది. ప్రైవేటు కొరియర్ సర్వీసులతో పోల్చుకుంటే స్పీడ్ పోస్ట్ ధరలు చాలా చౌకగా వున్నాయని చెబుతున్నారు. 500 గ్రా. (అర కిలో) బరువున్న స్పీడ్ పోస్ట్ కవరుకు 2 వేల కి.మీ. పైపడినా కేవలం రూ.93లుగా నిర్ణయించడం సామాన్యుడికి కూడా పెద్ద ఊరటగా చెబుతున్నారు.

ఆదాయ వనరుగా కూడా వుండాలి

- పవన్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, వాయల్పాడు

తపాలా శాఖ ఉనికి కొనసాగాలన్నా, మరింత బలోపేతం కావాలన్నా లాభప్రదమైన విధానం వుంటేగానీ జరుగదు. ఇంతవరకు అమల్లో వున్న రిజిస్టరు పోస్ట్ ధరలు అత్యంత కారు చవకగా ఉన్నాయి. పోస్టల్ శాఖకు ఈ విధానం గుదిబండగా వుంది. ఆధునిక సాంకేతికతను జోడించి విలువ ఆధారిత సేవలను అందించాలనే లక్ష్యంతో స్పీడ్ పోస్ట్‌ను పూర్తి స్థాయిలో అమల్లోకి తెస్తున్నాము. తపాలా సేవల్లో ఇదో గొప్ప విధానంగా భావిస్తున్నాము.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పీలేరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం కాకులారం పల్లె పంచాయతీ చింతకొమ్మ చెరువు (ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వెనుక)లో ఓ గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. మృతదేహాన్ని స్థానికులు మంగళవారం ఉదయం గుర్తించి తమకు సమాచారం అందించారని, అయితే మృతదేహం గుర్తు పట్టలేని విధంగా కుళ్లిపోయిందన్నారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 25-35 ఏళ్ల మధ్య ఉంటుందని, అతను 'అర్బన్ అప్' బ్రాండు ఎరుపు, పసుపు, తెలుపురంగుల గళ్ల ఫుల్ హ్యాండ్స్ రెడీమేడ్ షర్టు, రెడీమేడ్ బ్లాక్ కలర్ ఫ్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహం కుడి చేతిమీద అమ్మ అనే పచ్చ బొట్టు, మణికట్టు దగ్గర 'ఎస్‌బీఆర్' అనే అక్షరాలు ఉన్నాయన్నారు. వివరాలకు 9440796744 నెంబరుకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

హామీలు సూపర్‌హిట్ అనడం హాస్యాస్పదం : తులసిరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అయ్యాయని సీఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీ సాక్షిగా చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాయచోటిలో మీడియాతో మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీల్లో ప్రధానమైన హామీలు ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదన్నారు. నిరుద్యోగ యువతకు సంబంధించి ప్రతి నెల నిరుద్యోగ భృతి కింద ఒక్కొక్కరికి 3 వేలు ఇస్తామని చెప్పి 20 లక్షల మంది నిరుద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. అలాగే ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500లు ఇస్తామని ఇవ్వలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని అతీగతి లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వట్టి మాటలు కట్టబెట్టి వచ్చే నవంబరు 1 నుంచైనా ప్రధానమైన ఈ మూడు హామీలను అమలు చేయాలని తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లాబకాష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్ఎండీ గౌస్, రఫీ, బుల్లెట్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక



విద్యార్థి కార్తీక్

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దంగారి పల్లెకు చెందిన కార్తీక్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 23 నుంచి 25 వరకు కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరులో రాష్ట్ర స్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించగా, ఇందులో పాల్గొని ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేశారు. ఇతను ఛత్తీస్ ఘడ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన నున్నాడు. కాగా కార్తీక్‌ను వారి తల్లిదండ్రులు, కోచ్ మహేంద్రలు అభినందించారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన ఎస్పీ



మంత్రిని కలిసిన ఎస్పీ ధీరజ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని నూతన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య పలు ముఖ్య అంశాలపై చర్చ జరిగింది. జిల్లాలో శాంతి భద్రతలను బలోపేతం చేయడం, నేరాల నిరోధక చర్యలు, ప్రజలకు తక్షణ న్యాయం అందించేందుకు పోలీసులు చేపడుతున్న చర్యలను ఎస్పీ మంత్రికి వివరించారు. ముఖ్యంగా రవాణా భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, మైనర్ డ్రైవింగ్ నియంత్రణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు. అలాగే యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించే దిశగా పోలీసుశాఖ తరపున సహకారం అందించనున్నట్లు ఎస్పీ తెలిపారు. క్రీడల ద్వారా యువతను మాదక ద్రవ్యాలు, అక్రమ కార్యకలాపాల నుంచి దూరంగా ఉంచడం, సానుకూల దిశగా మల చడం అవసరమని సూచించారు. మంత్రి ఈ సంద ర్భంగా స్పందిస్తూ పోలీసుశాఖ చేస్తున్న కృషిని అభినందించారు.

రెడ్డెమ్మ సన్నిధిలో పవన్‌కళ్యాణ్ ఓఎస్‌డీ



రెడ్డెమ్మతల్లి సేవలో ఓఎస్‌డీ మధుసూదన్

గుర్రంకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీ రెడ్డెమ్మ అమ్మవారిని మంగళ వారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్‌డీ మధుసూదన్ దంపతులు దర్శించుకున్నారు. ఓఎస్డీ స్వగ్రామం పెద్దమండ్యం మండలం కోటకొండ కావడంతో ఆయన దసరా ఉత్సవాలకు వచ్చారు. ఈ క్రమంలో సతీ సమేతంగా రెడ్డెమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి టీడీపీ నేతలు, ఆలయ సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అలంకరణలో అమ్మవారిని అలంకరించారు. కార్యక్రమంలో ఈఓ మంజుల, నేతలు హరిప్రసాద్‌నాయుడు, నక్కా గోపి, రెడ్డిప్రసాద్ నాయుడు, కృష్ణమూర్తి, జయచంద్ర, రమేష్, చలమారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965


విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వర రావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్చసన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

చెరువులకు నీరందేనా..!

● ప్రతిపాదనలకు పరిమితమైన లిఫ్ట్ ఇరిగేషన్ నిధులు ● ఆయకట్టు రైతుల ఆశలు నెరవేరేనా!

పోరుమామిళ్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పంట పొలాలకు సాగునీరందించడం కోసం రెండేళ్ల క్రితం ప్రతి పాదనలు పంపినా అవి కార్యరూపం దాల్చలేదు. దీంతో కూటమి ప్రభుత్వంలో అయినా ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చి ఆశలు నెరవేరుతాయోనని రైతులు ఎదురు చూస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

పోరుమామిళ్ల చెరువు నుంచి సిద్దవరం, చిన్నాయపల్లె, రజాసాహబ్‌పేట చెరువులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరందించేందుకు రెండేళ్లక్రితం కోటి రూపాయలు నిధులు కేటాయించాలని ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత దాని గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.



సిద్దవరం పరిసర ప్రాంతంలో బీడుగా ఉన్న పంట పొలాలు

దీంతో ఈ చెరువుల కింద భూములు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. సిద్దవరం చెరువు కింద 180 ఎకరాల ఆయకట్టు ఉంది. అగ్రహారం, చిన్నాయపల్లె దళితవాడ తదితర ప్రాంతాల్లో మరో 300 ఎకరాలు పంట పొలాలు ఉన్నాయి. వాటికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నిధులు మంజూరైతే సిద్దవరం, చిన్నాయపల్లె పరిసర ప్రాంత ఆయకట్టు పొలాలకు కాల్వ ద్వారా నీరందే అవకాశాలున్నాయి. అలాగే రజాసాహబ్‌పేటకు సంబంధించి దాదాపు 45 లక్షల రూపాయలు వరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ చెరువులో నీరు నింపితే యరసాల, చిన్న యరసాల, కొండుగారిపల్లె, తిరువెంగళాపురం, కొత్తచెరువులకు నీరంది పరిసర ప్రాంతాల పొలాలకు నీరందుతుంది. వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు చెబుతున్నారు. ఇక కొండుగారిపల్లె నుంచి బద్వేలు చెరువు వరకు గంగ నీరు మీద ఆధారపడి దాదాపు 20 చెరువులు ఉన్నాయి. అయితే కొండుగారిపల్లె వద్ద జాతీయ రహదారి నిర్మాణం కోసం కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం పూర్తయితే చెరువులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరందే అవకాశాలు ఉన్నాయి. కానీ ఇవన్నీ కార్యరూపం దాల్చితే రైతులు తమ పొలాలను పండించుకోవడానికి వీలుంటుందని, వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయని ఆశిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తే ఈ ప్రాంత పొలాలకు నీరందే అవకాశాలున్నాయి. ఈవిషయమై బద్వేలు తెలుగుగంగ డీఈ వెంకటేశ్వర్లును 'ఆంధ్రజ్యోతి'వివరణ కోరగా రెండేళ్ల క్రితం చిన్నాయపల్లె, సిద్దవరం లింకు కలుపుతూ లిఫ్ట్‌ఇరిగేసన్‌కు



చెట్లతో నిండిన సిద్దవరం చెరువు



అరకొరగా చేరిన నీటితో రజాసాహెబ్‌పేట చెరువు

రూ.2కోట్లు ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే ఇరిగేషన్ ఏఈ కొండారెడ్డిని వివరణ కోరగా, రజాసాహబ్‌పేట చెరువుకు సంబంధించి రూ.45లక్షలు ప్రతిపాదనలు పంపామన్నారు.

కారు ఢీ.. ఒకరి మృతి

చాపాడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్వారకానగరం గ్రామం వద్ద మైదుకూరు-కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దర్గా బాబాహసన్ (40) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. దువ్వూరు మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన బాబాహసన్ మైదుకూరుకు పని నిమిత్తమై వెళ్లాడు. తిరిగి మోటారు సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్ర గాయా లయ్యాయి. చికిత్స కోసం అతన్ని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



నవ్యశ్రీ మృతదేహం

పులివెందుల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని బాకరాపురం జయమ్మ కాలనీకి చెందిన నవ్యశ్రీ (బేబి) (19) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు..... సున్నిత మనస్తత్వం కలిగిన నవ్యశ్రీకి తరచూ కడుపునొప్పి వచ్చేదన్నారు. దీనికితోడు హర్రర్ చిత్రాలు ఎక్కువగా చూస్తూ, రాత్రిళ్లు ఎక్కువగా కలవరించేదని... సోమవారం రాత్రి హర్రర్ మూవీ చూసి భయ భ్రాంతులకు గురైందన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో ఓ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని, తెల్లవారు జామున భర్త కమల్‌నాథ్ గమనించి ఆమె తల్లిదండ్రులకు తెలియజేశాడన్నారు. మృతురాలి తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు లారీలు ఢీ... డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న డ్రైవర్

జమ్మలమడుగు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలం తలమంచిపట్నం గ్రామం వద్ద మంగళవారం సాయంత్రం రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న శనిబోయిన తిరుపాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతను జమ్మలమడుగు మండలం అనంతగిరి గ్రామానికి చెందిన వ్యక్తి. ప్రమాదంలో లారీల ముందు భాగాలు దెబ్బతిన్నాయి. గాయపడిన లారీ డ్రైవర్‌ను జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



కలసపాడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ తంబళ్లపల్లె గ్రామానికి చెందిన అంజలి (26) అనే మహిళ అదృ శ్యం అయినట్లు ఆమె భర్త శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత నెల 22న పోరుమామిళ్లకు హోటల్లో పని చేసేందుకు వెళ్లిన తన భార్య ఇప్పటి వరకు ఇంటికి రాలేదని, చుట్టుపక్కల బంధువులను విచారించినా ఎక్కడ ఆచూకీ తెలియలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9121100632 నెంబర్‌కు తెలియజేయాలన్నారు.

మోటరు బైకులు ఢీ...ముగ్గురికి గాయాలు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నారెడ్డిపేట సమీపంలో మోటరు బైకు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. పుల్లీడు నుంచి మోటరు బైకులో వస్తున్న వాహనాన్ని కొత్తరోడ్డు సమీపంలో మరో వ్యక్తి పోరుమామిళ్ల నుంచి స్వగ్రామం వెళుతుండగా వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో గాయపడ్డ ముగ్గురిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి చికిత్స అందించారు.

ఆటో నుంచి జారిపడి మహిళకు...

మైదుకూరు సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణం కడప రోడ్డులో తెగిపోయిన గండి వద్ద కూలీలతో వెళుతున్న ఆటో నుంచి జారిపడి మహిళకు గాయాలయ్యాయి. పంది అడ్డు రావడంతో ఆటో సడన్‌బ్రేకు వేయడంతో ఆటోనుంచి మహిళ జారి పడింది. ఇటీవల ఓ గర్భిణి కూడా పంది అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం నుంచి పడి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో విచ్చలవిడిగా పందులు తిరుగుతూ ప్రజలకు, ప్రయాణికులను ప్రమాదాలకు గురిచేస్తున్నాయని, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రేమించి.. పెళ్లికి నిరాకరించాడని యువతి ఆత్మహత్యాయత్నం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించిన వాడు పెళ్లికి నిరాకరించి మరో యువతితో పెళ్లికి సిద్ధం కావడంతో మనస్థాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలిలా.. పోరుమామిళ్ల మండలంలోని ఈదుళ్లపల్లె గ్రామానికి చెందిన దేవరాజ్ అనే యువకుడు ఓ యువతి ఎనిమిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల ఆ యువకుడు మరో యువతిని పెళ్లి చేసుకోవాలనే ప్రయత్నాలు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రేమించిన యువతి అతన్ని నిలదీసింది. అతని బంధువుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో పోలీసుల దృష్టికి తీసుకెళ్లింది. పోలీసులు ఇరువర్గాల వారిని పిలిపించి గతంలో విచారణ జరిపారు. వారికి నిర్ణయం చెప్పాలని గడువు కూడా ఇచ్చారు. కానీ మంగళవారం మళ్లీ సమస్య మొదటికొచ్చింది. దేవరాజ్ నీవంటే ఇష్టం లేదని, పెళ్లి చేసుకోనని ప్రేమించిన యువతికి తెగేసి చెప్పాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆ యువతి స్టేషన్ బయట విషద్రావణం తాగి సొమ్మసిల్లి పడిపోవడంతో బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

అమ్మవారిశాల కార్యాలయానికి తాళం





అమ్మవారిశాల కార్యాలయానికి తాళాలు, పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఆర్యవైశ్యులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానికశ్రీవాసవీ కన్య కాపరమేశ్వరి ఆలయానికి సంబంధించిన కార్యాలయానికి దేవ స్థానం మాజీ కార్యదర్శి సత్యనారాయణ తాళాలు వేశారు. మంగళ వారం పోరుమామిళ్లలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కార్యాలయానికి ఆయన తన సమస్యలు పరిష్కరించాలంటూ నోటీసు అంటించి తాళం వేశారు. దీంతో ఆర్యవైశ్య మహిళలు పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కొండారెడ్డి ఇరువర్గాల వారితో చర్చలు జరిపారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తాను ఏ తప్పు చేయకపోయినా కొద్దిరోజుల క్రితం జరిగిన పంచాయతీలో తనను క్షమాపణ పత్రం రాయించమన్నారని, రాసిచ్చినా కూడా తీసుకోకుండా రూ.5116లు అపరాధ రుసుం చెల్లించాలని కోరడంతో నిరాకరించానన్నారు. ఆర్యవైశ్యులకు అందుతున్న గౌరవ మర్యాదలు తనకు ఆలయంలో ఇవ్వకపోవడంతో అందరికీ విషయం తెలియాలన్న ఉద్దేశ్యంతోనే తాళాలు వేశానన్నారు. ఇందుకు ఎస్ఐ ప్రస్తుతం దసరా ఉత్సవాలు జరుగుతున్నందున ఈనెల 4వ తేదీ తరువాత ఇరువర్గాల వాదనలు వింటామని, అంతవరకు ఉత్సవాలు ప్రశాంతంగా జరపాలని కోరడంతో ఇరువర్గాలు సమ్మతించారు. దీంతో ఆలయ కార్యాలయ తాళాలు తెరచుకున్నాయి.

మద్యం షాపుల్లో విజిలెన్స్ తనిఖీ

వేంపల్లె, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యంషాపులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ విశ్వనాథరెడ్డి తనిఖీ చేశారు. మంగళవారం రాత్రి స్థానిక పులివెందుల రోడ్డు, కడప రోడ్డులోని వైన్‌షాపులను తనిఖీ చేసి సమయం పాటించాలని, బెల్టుషాపులకు మద్యం సరఫరాచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా శ్రీధర్‌కుమార్

వాల్మీకిపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల తిరుపతిలో జరిగిన ఎన్నికల్లో జిల్లా ఉపాధ్యక్షుడిగా వాల్మీకిపురం వాసి శ్రీధర్ కుమార్ నియమితులయ్యారు. 25 ఏళ్లుగా క్రికెట్ క్లబ్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక క్యాంపులు చేస్తూ, జిల్లాలో క్రికెట్ యాక్టివిటీస్ చేస్తున్నందున ఆయన సేవలను గుర్తించి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విజయకుమార్ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌కుమార్ మాట్లాడుతూ క్రికెట్ క్రీడాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు.

బంగారు నగల బ్యాగ్ చోరీ

ముద్దనూరు సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి దేనేపల్లి గ్రామానికి చెందిన వెన్నపూస లక్ష్మి ప్రసన్నకు చెందిన బంగారు నగల బ్యాగ్ మంగళవారం చోరీకి గురైనట్లు సీఐ దస్తగిరి తెలిపారు. లక్ష్మిప్రసన్న అమ్మగారి ఊరు పొట్లదుర్తికి వెళ్లేందుకు ముద్దనూరు పాత బస్టాండులో ఆర్టీసీ బస్సు ఎక్కి బ్యాగు సీటులో పెట్టి కూర్చొంది. నాలుగు రోడ్ల కూడలి వద్దకు వెళ్లే సరికి బ్యాగు కన్పించలేదు. బస్సులో వెతికినా ఫలితం లేదు. బ్యాగులో 45 గ్రాముల బంగారు నల్లపూసల దండ, చైను ఉందని.. దాదాపు రూ.2లక్షల విలువ చేస్తుందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు

శివాలయంలో హుండీ..

రామాపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో వెలసిన శివాలయంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు హుండీ చోరీ చేశారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాజా తెలిపారు. మంగళవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకొని ఆలయ నిర్వాహకులను విచారించగా హుండీలో రూ.10 వేల వరకు నగదు ఉందని, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారన్నారు. కాగా కడప బార్డర్‌లోని ఘాటు కింద హుండీ లభ్యమైనట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ముగ్గురికి గాయాలు

చిన్నమండెం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లి ఆర్చి వద్ద సోమవారం రాత్రి 10 గంటల సమయంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. దేవగుడిపల్లి కస్పాకు చెందిన నాగరాజు కుమారుడు విశ్వ చిన్నమండెం నుంచి దేవగుడిపల్లికి వస్తున్నాడు. కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై దేవగుడిపల్లి ఆర్చి వద్దకు వచ్చేసరికి చిన్నమండెం అరబిక్‌వీధికి చెందిన సాధిక్ జాఫర్, శేషావలి రాయచోటి వైపు నుంచి చిన్నమండెంకు వస్తూ విశ్వ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ఐదుగురి అరెస్టు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గాలివీడు మండలం అరవీటివాండ్లపల్లె సమీపంలో మంగళవారం గంజాయి విక్రయిస్తుండగా దాడులు చేసి 5.5 కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ మురళీకుమార్ తెలిపారు. ధనియాల రఘు, ఆవుల అంజి, ధనియాల రాజశేఖర్, చందు, శ్రీనివాసులు అనే వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి డైరెక్టర్‌గా దాసరి బాబు



దాసరి బాబు

మైదుకూరు సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి డైరెక్టర్‌గా మైదుకూరు తెలుగుదేశం పార్టీ పట్టణాధ్యక్షుడు దాసరి బాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా రాష్ట్రప్రభుత్వం రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి డైరెక్టర్‌గా తనను నియమించిందన్నారు.

మాస్టర్ ప్లాన్ ఏర్పాటుకు దేవస్థానం పరిసరాల పరిశీలన

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారి మఠం దేవస్థానం అభివృద్ధి కోసం దేవదా యశాఖ అధికారులు గణేశ్‌రాజు, కర్నూలు డీఈఈ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఇటీవల మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రసాదం స్కీంకింద రూ.50 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు మంగళవారం బ్రహ్మంగారిమఠం దేవస్థానం పరిధిలోని జగన్మాత ఈశ్వరీదేవి మఠం, బ్రహ్మంగారి నివాసం, కక్కయ్యమఠం, పోలేరమ్మ గుడి, ఏపీ టూరిజం తదితర ప్రాంతాలను బి.మఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డితో కలిసి అధికారులు పరిశీలించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశామని, త్వరలోనే



వీరబహ్మేంద్రస్వామి దేవస్థానం పరిశీలిస్తున్న అధికారులు

దేవదాయశాఖకు పంపుతామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు పూజా శివాయాదవ్, మేకల సుధాకర్, రమణారెడ్డి పాల్గొన్నారు.



పిల్లల వివరాలు తీసుకుంటున్న అంగన్వాడీ కార్యకర్త

అనాథ పిల్లలకు లోకేశ్ చేయూత

● ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

● సాయం చేసేందుకు కలెక్టర్‌కు ఆదేశం

కడప, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు, పేద కుటుంబాలు, అనాథలపై వార్తలు వస్తే మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందిస్తూ వారిని ఆదుకుంటూ నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 28న దువ్వూరుకు చెందిన చిన్నారులు లక్ష్మి (6), యశ్వంత్(7)ల దీనగాథపై ఆంధ్రజ్యోతిలో 'అమ్మానాన్నలు లేరు.. అనాథలైన చిన్నారులు' అంటూ కథనం ప్రచురితమైంది. దువ్వూరుకు చెందిన నరసింహులు, గంగభవానీల పిల్లలు లక్ష్మి, యశ్వంత్. తల్లి గంగాభవాని మూడు నెలల క్రితం మృతిచెందారు. 28వతేదీ శనివారం తండ్రి నరసింహులు ఫిట్స్ వచ్చి అకస్మాత్తుగా మృతిచెందారు. దీనితో వీరి పిల్లలు లక్ష్మి, యశ్వంత్ అనాథలయ్యారు. పిల్లలిద్దరూ తాత బాలగంగయ్య వద్ద ఉంటున్నారు. వీరి దీనగాథపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని మంత్రి నారా లోకేశ్ మంగళవారం ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తూ "యశ్వంత్, లక్ష్మిల హృదయ విదారక పరిస్థితి కదిలించింది. వారి తల్లిదండ్రులు చనిపోయారు. ఇపుడు వృద్ధుడైన తాత చూసుకుంటున్నారు. ఇలాంటి విషాదంలో ఏ బిడ్డ కూడా నిస్సహాయంగా ఉండకూడదు. కడప జిల్లా కలెక్టర్ వెంటనే సహాయ సహకారాలు అందించాలి. ప్రభుత్వ పథకాలను ఆ పిల్లలకు అందేలా చూసి వారి భవిష్యత్తుకు భరోసా కలిగించాలి" అంటూ పోస్ట్ చేశారు. లోకేశ్ ట్విట్టర్ పోస్టుకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ స్పందించారు.

నెలకు రూ.8వేలు ఆర్థికసాయం

ఆంధ్రజ్యోతి కథనంపై మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వేగంగా స్పందించారు. మంగళవారం సెలవుదినం అయినప్పటికి అంగన్వాడీ కార్యకర్తలను ఆ చిన్నారుల వద్దకు పంపించారు. పిల్లల చదువులు, బాగోగులు చూసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే పిల్లలను చైల్డ్ హోంకు పంపించేందుకు అవ్వాతాతలు నిరాకరించారు. దీనితో ప్రధానమంత్రి స్కీం మిషన్ వాత్సల్య ద్వారా ఒక్కో చిన్నారికి నెలకు రూ.4వేలు చొప్పున రూ.8వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. అవ్వాతాతలతో మాట్లాడామని వారికి అవసరమైన ఆధార్‌కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు, చదువుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ ఆంధ్రజ్యోతికి వివరించారు.

గండికి భారీగా మహిళా భక్తులు



అన్నదాన కౌంటర్ వద్ద చెట్ల కింద సేద తీరుతున్న మహిళలు

చక్రాయపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వీరాంజనేయస్వామి దర్శనం కోసం మంగళవారం మహిళలు భారీ ఎత్తున గండికి చేరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దాదాపు 70శాతం మంది మహిళలే కనిపించడం విశేషం. క్యూలైన్లు, అన్నదానం, లడ్డూ ప్రసాదాల కౌంటర్ వద్ద క్యూలైన్‌లు కిక్కిరిసిపోవడంతో మహిళలు చెట్ల కింద సేద తీర్చుకున్నారు. ఎన్నడూ లేని విధంగా గండికి మహిళలు భారీగా రావడానికి ఒక వైపు దసరా సెలవులు, మరోవైపు ఉచిత బస్సు కావడం కారణమని తెలుస్తోంది.


రైల్వేకోడూరు: దుర్గాదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి


రాజంపేట: మహిషాసురమర్దినిగా చౌడేశ్వరిదేవి


చిన్నమండెంలో కాళీమాత..


పెనగలూరులో కామాక్షమ్మ..


నందలూరులో కాళికాంబ..


లక్కిరెడ్డిపల్లెలో.. సర్వమంగళాదేవి


దర్బారు సాయినగర్‌లో దర్గా మాతాజీ..

జయజయహే.. మహిషాసుర మర్దిని..

రాయచోటిటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని వీరభద్రాలయంలో అమ్మవారు మహిషాసురమర్థినిగా భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తపేట రామాపురంలో చౌడేశ్వరి, ఉమా మహేశ్వర ఆలయం, అగస్త్యేశ్వరాలయంలో దాక్షాయణి, తోపు గంగమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్థిని అలంకారంలో దర్శనమిచ్చారు.

రాయచోటి-నేతాజీ సర్కిల్ : సంబేపల్లె దేవరాయి నల్లగంగమ్మ దుర్గామాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు శివగంగిరెడ్డి, నల్లగంగమ్మ తల్లి ఆలయ ఈవో కొండారెడ్డి పర్యవేక్షించారు.

రైల్వేకోడూరు : పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం లో మంగళవారం అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో పంచామృతాభిషేకం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, దేవీ భాగవత పారాయణం, నవావరణ, సువాసిని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గునిశెట్టి రమేష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని దర్బారు సాయినగర్‌లో సమర్థ సద్గురు దర్గా మాతాజీ మహిషాసురమర్దినిగా దర్శన మిచ్చారు

లక్కిరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో సర్వమంగళాదేవికి దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నందలూరు : మండల కేంద్రంలో వాసవీ కన్యకాపరమేశ్వరి మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం స్థానిక బస్టాండు కూడలి నుంచి ఆలయం వరకు ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో మహిషాసురుడి ప్రతిమను ఊరేగిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు యంబలూరు నరసింహ స్వామి, ఉపాధ్యక్షుడు మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహ శ్రేష్ఠి, సెక్రటరి గెలివి నాగసురేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహప్రసాద్, మంచికంటి నారాయణ, యువజన సంఘం అధ్యక్షులు భూపాల సునీల్‌కుమార్, ఉపాధ్యక్షులు గెలివి లోకేష్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు. నాగిరెడ్డిపల్లె వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కాళికాంబ దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

పెనగలూరు: మండల కేంద్రంలోని శివాలయంలో కామాక్షమ్మ దుర్గామాతగా దర్శనమిచ్చారు.

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లి కస్పాలోని ఆలయంలో కాళీమాతను దుర్గాదేవిగా అలంకరించారు. అమ్మవారి ఎదురుగా కుంభం పోసి పూజల అనంతరం భక్తులకు ప్రసాదంగా పంచి పెట్టారు.

రాజంపేట టౌన్: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం కన్యకాపరమేశ్వరి, చౌడేశ్వరి, సాధు కామాక్షమ్మ ఆలయాల్లో అమ్మవార్లు మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయగిరి యల్లమ్మ సిద్ధిధాత్రి అలంకారంలో, వెంకటరాజంపేటలో కనకదుర్గ మహిషాసురమర్దినిగా అలంకరణలో భక్తులను అనుగ్రహించారు.

ఒంటిమిట్ట: కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి 9 గంటలకు మంత్రపుష్పం, దశహారతులతో మంగళహారతి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సోమిశెట్టి మనోహర్‌బాబు, తుమ్మలపెంట శ్రీనివాసులు, రెంటాల హరికృష్ణ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : స్థానిక శ్యామలాంబ సమేత సోమేశ్వరాలయంలో పూజలు చేశారు. వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. .

సుండుపల్లె: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలోదర్శనమిచ్చారు.


రాయచోటి: మహిషాసురమర్దినిగా తోపు గంగమ్మ


రాయచోటి అమ్మవారిశాలలో వాసవీ కన్యకాపరమేశ్వరి


దుర్గామాత అలంకరణలో నల్లగంగమ్మ తల్లి


అగస్త్యేశ్వరాలయంలో దాక్షాయణి


ఒంటిమిట్టలో వాసవీ కన్యకాపరమేశ్వరి


సుండుపల్లె: దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి


చిట్వేలిలో.. శ్యామలాదేవి

నేడు టీడీపీ సమావేశం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల క్లస్టర్ కన్వీనర్ యనమల మదన్‌మోహన్ ఆధ్వర్యంలో బుధవారం లక్కిరెడ్డిపల్లెలోని పీజేఆర్ కల్యాణమండపంలో మండల టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు యనమల మదన్‌మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

నందలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మైనర్లు వాహనాలు నడిపితే, ఆ వాహనాలను సీజ్ చేయడమేగాకుండా, వారికి వాహనాలు ఇచ్చినవారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ధీరజ్ కనుబిల్లి ఆదేశాల మేరకు మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అధికారులు జవాబుదారీగా వ్యవహరించాలి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అధికారులు జవాబుదారీగా పనిచేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.

కేజీబీవీలో తాగునీటి సమస్య పరిష్కారం

చిన్నమండెం కస్పాలోని ప్రజలతోపాటు, కస్తూరిబా గురుకుల పాఠశాల విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న మంత్రి మంగళవారం అక్కడబోరు వేయించి, మోటారు బిగించి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల కోరిక మేరకు గ్రామంలో బోరు వేసి మోటారు బిగించి, నీరు విడుదల చేశామన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో నీటి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్ : ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం అని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను మంత్రికి సమర్పించారు. ప్రతి ఒక్కరి సమస్యను ఓర్పుతో ఆలకించిన మంత్రి మండిపల్లి ప్రజల సమస్యలపై తక్షణం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొంత మంది అధికారులు, నాయకులు మంత్రికి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు.


బోరును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

పంచాయతీ కార్మికులకు బ్యాంక్ ద్వారా జీతాలివ్వాలి


కార్మికుల సమస్యపై మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

గాలివీడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికులకు బ్యాంకు ద్వారా జీతాలివ్వాలని, కొబ్బరి నూనె, చెప్పులు, టోపీలు, మాస్కులు, గ్లౌజులు, యూనిఫామ్ ఇవ్వాలని ఏపీ గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు, పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులకు నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలన్నారు. కేవలం 11 మందితో పని చేయిస్తుండడంతో తీవ్ర పనిభారం ఉందన్నారు. గాలివీడు జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు ఓబులమ్మ, లక్ష్మీదేవిలతో పాటు పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు రామచంద్ర, నరసింహులు, నారాయణమ్మ, రాజమ్మలు పాల్గొన్నారు.

కమనీయంగా వేంకటేశ్వర కల్యాణం



ముత్యాల తలంబ్రాలు తీసుకువస్తున్న ముక్కా దంపతులు, కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే.బుడుగుంటపల్లె వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం రాత్రి శ్రీవారి కళ్యాణం నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు మహేశ్వరి, దేసూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి వాటర్ కూలర్ వితరణ


కూలర్‌ను ప్రారంభిస్తున్న పోతుగుంట రమేశ్‌నాయుడు

పెనగలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జిల్లా బీజేపీ కార్యదర్శి పనతల సురేష్ మంగళవారం వాటర్ కూలర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ శైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ కూలర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు కోనేటి రెడ్డికృష్ణరాయల్, పీహెచ్‌సీ డాక్టర్ శ్రేయ, ఎస్‌ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి జిల్లా సేవా పక్షోత్సవాల కన్వీనర్ ఆదినారాయణ, రాష్ట్ర ఎస్సీ మాజీ కార్యదర్శి ఈటమాపురం సుబ్రహ్మణ్యం, నాయకులు జనార్దన్, రమేస్, శ్రీనివాసులు, ఎన్.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లలకు సరైన సమయంలో వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారి సశక్త పరివార్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న పిల్లలకు వచ్చే వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి సుబ్బరాయుడు మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. మండల వైద్యాధికారులు పౌష్టికాహారంపై గర్భిణులకు అవగాహన కల్పించారు. రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్ ఎలా వస్తుందో తెలియజేశారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బంది, ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. వైద్యా ధికారు లు మౌనిక, మానసారెడ్డి, విజయ్‌కుమార్, నాగేష్, అబ్దుల్లా, సునీల్, నరసింహ మూర్తి, నజీమ్ ఉన్నిసా, సిబ్బంది భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనరసమ్మ, సురేష్‌కుమార్, శ్రీధర్, ధనుంజయరాజ్ కుమార్, వెంకటసుబ్బయ్య తదితరు లు పాల్గొన్నారు.

'మనం' సేవలు ఆదర్శప్రాయం


చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మనం స్వచ్ఛంద సంస్థ సేవలు ఆదర్శప్రాయమని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నా రు. వినాయక నిమజ్జనం సందర్భంగా దిగువ అబ్బవరం గ్రామం దిగువ ఇందుకూరుపల్లెలో టపాసులు పేలడం తో తీవ్రంగా గాయపడిన శివశంకర్ అనే వ్యక్తికి ఆప రేషన్ నిమిత్తం ఆయన కుటుంబానికి మంగళవారం రూ.50 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ బా బు మాట్లాడుతూ పేదలకు సామాజిక సేవ సంకల్పం తో ముందుకు వచ్చిన 1983 ఎస్ఎస్‌సీ విద్యార్థులు మ నం స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి పట్టణానికి వచ్చిన పేద ప్రజల ఆకలి తీరుస్తున్నారన్నారు. సంస్థ అధ్యక్షుడు యడం ప్రకాశ్, సభ్యులు సుగవాసి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కి రూ.50 వేలు అందజేత

సుండుపల్లె: సుండుపల్లె మండలం బలిజపల్లెకు చెందిన విద్యార్థి నాగచైతన్య (14) వైద్యం కోసం మనం సామాజిక సంస్థ ప్రముఖ వ్యాపారవేత్త ఆంజనేయరెడ్డి రూ.50 వేలు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు ఆయన చెక్కును అందజేశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న విద్యార్థికి మనం సామాజిక సంస్థ ఆర్థిక సాయం అందజేయడాన్ని కలెక్టర్ అభినందించారు. మరిన్ని సేవా కార్యక్రమాల్లో ముందుండాలని తెలిపారు.

వాన నీటిని ఒడిసి పడదాం..

● మండలంలో ముమ్మరంగా పంట కుంటలు, ఇంకుడు గుంతలు తవ్వకం ● ఉపాధి నిధులతో ప్రభుత్వ సహకారం

సుండుపల్లె, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిని ఒడిసి పట్టడం ద్వారా భూగర్భజలాలను పెంపొందించడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి నీటి బొట్టును భూమిలో ఇంకించేందుకు చర్యలు చేపట్టింది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు, రైతుల పొలాల్లో పంట కుంటలు తవ్వడానికి శ్రీకారం చుట్టింది.

జిల్లాలో అధికశాతం వ్యవసాయం వర్షాధారం. పల్లపు ప్రాంతాల్లో పరిస్థితి ఆశాజనకంగానే ఉన్నా.. మెట్ట ప్రాంతాల్లో సాగుచేసే మామిడి, ఇతర పండ్ల తోటలకు వేసవిలో సాగు నీరు అందడం లేదు. అలాంటి ప్రాంతాల్లోని పొలాల్లో వర్షపు నీటిని నిల్వ చేసేందుకు వీలుగా పంట కుంటల తవ్వకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా సుండుపల్లె మండలంలో 420 పంట కుంటలు తవ్వాలనే లక్ష్యం నిర్దేశించింది. దీంతో ఉపాధి హామీ పథకం కింద జనవరి నెల నుంచి పంట కుంటల తవ్వకాల పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 356 పంట కుంటలు తవ్వుతున్నారు. 9 అడుగుల పొడవు, 9 అడుగుల వెడల్పుతో ఉపాధి కూలీలు పంటకుంట నిర్మిస్తారు. దీనికి ప్రభుత్వం సుమారు రూ.45 వేలు చెల్లిస్తుంది. 10 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పుతో, 8 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పుతో, 15 అడుగుల పొడవు 15 అడుగుల వెడల్పుతోను పంట కుంటలను తవ్వారు. పంటకుంట తవ్వించుకున్న రైతుకు ప్రభుత్వం 20 రకాల కూరగాయల విత్తనాలను ఉచితంగా ఇస్తుంది. సుండుపల్లె మండల వ్యాప్తంగా తవ్విన పంట కుంటలను సంబంధిత అధికారులు పరిశీలించి పనితీరుపై హర్షం వ్యక్తం చేసినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. మరిన్ని పంట కుంటల తవ్వకానికి అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు.


ఉపాధి కూలీలు తవ్విన పంట కుంటలు


ఇంకుడు గుంత తవ్వుకుంటున్న ఉపాధి కూలీలు

ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు:

సుండుపల్లె మండలంలో 186 ఇంకుడు గుంతలు తవ్వాలని ఫిబ్రవరిలో ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ప్రస్తుతం అన్ని గ్రామాల్లోనూ కలిపి 156 గుంతల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది వీటిని తవ్వేందుకు ఇంటి వద్ద అనువైన స్థలాన్ని పరిశీలించి జియో ట్యాగింగ్ చేసి అనుమతులు మంజూరు చేశారు. ప్రతి గుంతకు మెటీరియల్, రైతు కూలి కలిపి రూ.5800 చెల్లించనున్నారు. వీటి నిర్మాణంతో ఇళ్ల నుండి నీరు రోడ్డుపైకి రాకుండా కొంత మేర పారిశుధ్య సమస్య పరిష్కారం అవుతుంది.

పంట కుంటకు ప్రోత్సాహం

మండలంలోమరిన్ని పంట కుంటలు, ఇంకుడు గుంతలు, ఊట కుంటల తవ్వకాలకు ప్రయత్నిస్తాం. ప్రస్తుత లక్ష్యం 186 ఇంకుడు గుంతలు. కానీ ఎంత మంది దరఖాస్తు చేసుకున్నా అనుమతి ఇస్తాం. ఇంకుడు గుంతలు తవ్వకాలతో భూగర్భంలో నీటి శాతం మరింత పెరుగుతుంది. పంటకుంటలు, ఊట కుంటల తవ్వకాలకు మరింత ప్రాధాన్యత ఇస్తాం

- లక్ష్మీనరసయ్య, ఏపీడీ

మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన ఎస్పీ

రాయచోటిటౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని నూతనఎస్పీ ధీరజ్ కునుబిల్లి మంగళవారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య పలు ముఖ్య అంశాలపై చర్చ జరిగింది. జిల్లాలో శాంతి భద్రతలను బలోపేతం చేయడం, నేరాల నిరోధక చర్యలు, ప్రజలకు తక్షణ న్యాయం అందించేందుకు పోలీసులు చేపడుతున్నచర్యలను ఎస్పీ మంత్రికి వివరించారు. ముఖ్యంగా రవాణా భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, మైనర్ డ్రైవింగ్ నియంత్రణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు.అలాగే యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించే దిశగా పోలీసుశాఖ తరపున సహకారం అందించనున్నట్లు ఎస్పీ తెలిపారు. క్రీడల ద్వారా యువతను


మంత్రిని కలిసిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

మాదకద్రవ్యాలు, అక్రమ కార్యకలాపాలనుంచి దూరంగా ఉంచడం, సానుకూల దిశగా మలచడం అవసరమని సూచించారు. మంత్రి ఈ సందర్భంగా స్పందిస్తూ పోలీసుశాఖ చేస్తున్న కృషిని అభినందించారు.

రెడ్డెమ్మ సన్నిధిలో పవన్‌కళ్యాణ్ ఓఎస్‌డీ

గుర్రంకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీ రెడ్డెమ్మ అమ్మవారిని మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్‌డీ మధుసూదన్ దంపతులు దర్శించుకున్నారు. ఓఎస్డీ స్వగ్రామం పెద్దమండ్యం మండలం కోటకొండ కావడంతో ఆయన దసరా ఉత్సవాలకు వచ్చారు. ఈ క్రమంలో సతీ సమేతంగా రెడ్డెమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి టీడీపీ నేతలు, ఆలయ సిబ్బంది పూర్ణకుంభస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా


రెడ్డెమ్మతల్లి సేవలో ఓఎస్‌డీ మధుసూదన్

దుర్గాదేవి అలంకరణలో అమ్మవారిని అలంకరించారు. కార్యక్రమంలో ఈఓ మంజుల, నేతలు హరిప్రసాద్‌నాయుడు, నక్కా గోపి, రెడ్డిప్రసాద్ నాయుడు, కృష్ణమూర్తి, జయచంద్ర, రమేష్, చలమారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పీలేరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం కాకులారం పల్లె పంచాయతీ చింతకొమ్మ చెరువు (ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వెనుక)లో ఓ గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. మృతదేహాన్ని స్థానికులు మంగళవారం ఉదయం గుర్తించి తమకు సమాచారం అందించారని, అయితే మృతదేహం గుర్తు పట్టలేని విధంగా కుళ్లిపోయిందన్నారు. చనిపోయిన వ్యక్తి వయస్సు 25-35 ఏళ్ల మధ్య ఉంటుందని, అతను 'అర్బన్ అప్' బ్రాండు ఎరుపు, పసుపు, తెలుపురంగుల గళ్ల ఫుల్ హ్యాండ్స్ రెడీమేడ్ షర్టు, రెడీమేడ్ బ్లాక్ కలర్ ఫ్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహం కుడి చేతిమీద అమ్మ అనే పచ్చ బొట్టు, మణికట్టు దగ్గర 'ఎస్‌బీఆర్' అనే అక్షరాలు ఉన్నాయన్నారు. వివరాలకు 9440796744 నెంబరుకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

హామీలు సూపర్‌హిట్ అనడం హాస్యాస్పదం : తులసిరెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలు సూపర్ హిట్ అయ్యాయని సీఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీ సాక్షిగా చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాయచోటిలో మీడియాతో మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీల్లో ప్రధానమైన హామీలు ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదన్నారు. నిరుద్యోగ యువతకు సంబంధించి ప్రతి నెల నిరుద్యోగ భృతి కింద ఒక్కొక్కరికి 3 వేలు ఇస్తామని చెప్పి 20 లక్షల మంది నిరుద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. అలాగే ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500లు ఇస్తామని ఇవ్వలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని అతీగతి లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వట్టి మాటలు కట్టబెట్టి వచ్చే నవంబరు 1 నుంచైనా ప్రధానమైన ఈ మూడు హామీలను అమలు చేయాలని తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లాబకాష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎస్ఎండీ గౌస్, రఫీ, బుల్లెట్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోస్టల్ స్పీడ్

- రిజిస్టర్ పోస్ట్‌లకు చెల్లు
- ఓటీపీ బట్వాడాలతో భరోసా


పీలేరు సబ్ పోస్ట్ ఆఫీసు భవనం

కలికిరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల తరబడి సాంప్రదాయ విధానాలతో వెనుకబడ్డ పోస్టల్ శాఖ ఆధునిక సాంకేతిక పోకడలతో ముందుకెళ్లేందుకు అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే 150 ఏళ్ల క్రితం బ్రిటీషు కాలంలో ప్రవేశపెట్టిన రిజిస్టరు పోస్ట్ విధానాన్ని పూర్తిగా సంస్కరిస్తూ తాజాగా స్పీడ్‌పోస్ట్ విధానంలోకి విలీనం చేస్తోంది. ఫలితంగా బుధవారం నుంచి రిజిస్టరు పోస్ట్‌ను ఉపసంహరించుకుంటోంది. దీంతో పాటు 1960లో ప్రవేశపెట్టి ఇప్పటివరకూ కొనసాగిస్తున్న 'రిజిష్టర్ పోస్ట్ అక్నాలెడ్జ్‌మెంట్ డ్యూ' (ఆర్‌పీఏడీ)కి కూడా మంగళం పలకనుంది. అయితే దీనికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుతమున్న స్పీడ్ పోస్ట్‌కే మరింత మెరుగులు దిద్ది కొత్త సాంకేతిక డిజిటల్ విధానానికి మళ్లిస్తోంది. 1986 ఆగస్టు 1 నుంచి తపాలా శాఖ స్పీడ్ పోస్ట్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. 'ఎక్కడికైనా.. ఎవరికైనా.. ఎప్పు డైనా' అన్న నినాదంతో గత విధానాలకన్నా మెరుగనిపించింది. ప్రస్తుత మున్న ఆర్‌పీఏడీ విధానాన్ని స్పీడ్ పోస్టుకు కూడా కొనసాగించనుంది.

డిజిటల్ డెలివరీలోకి స్పీడ్ పోస్ట్


స్పీడ్ పోస్టు, రిజిష్టర్ పోస్టుల కార్డులు

స్పీడ్ పోస్ట్ ద్వారా ప్రస్తుతమున్న డెలివరీ విధానాన్ని డిజిటల్ పరిజ్ఞానంలోకి మార్చుతోంది. ప్రస్తుతం స్పీడ్ పోస్టు ఉత్తరాలను ఏదో మొక్కుబడిగా చేరుస్తు న్నారు. న్యాయ పరమైన, చట్టపరమైన నోటీసులకు డెలివరీ విధానంలో ఖచ్చితత్వం లేక పోవడంతో స్పీడ్ పోస్టు అంతగా ప్రాచుర్యం సాధించలేక పోయింది. దీని కన్నా రిజిస్టరు పోస్ట్‌కే ప్రజలు మొగ్గు చూపేవారు. అయితే ప్రస్తుతం స్పీడ్ పోస్ట్ డెలివరీలో ఓటీపీ విధానాన్ని తీసుకొస్తున్నారు. పలాన వ్యక్తికి చేరాల్సిన ఉత్తరాన్ని అతని వద్దకెళ్లి అతని ఫోన్‌కు వచ్చిన ఓటీపీని చెపితేనే డెలివరీ చేయ నున్నారు. దీంతో చేరాల్సిన వ్యక్తికే చేరిందనే విషయం నిర్ధారణ అవు తుంది. దీనికి తోడుగా స్పీడ్ పోస్టుకు కూడా అక్నాలెడ్జ్‌మెంట్ డ్యూ విధానాన్ని అమలు చేస్తున్నారు. అదనంగా రూ.5 చెల్లిస్తే అక్నాలెడ్జ్‌మెంట్ కూడా జత చేసిన దాన్ని చేర్చినట్లు తిరుగు టపాలో రుజువు అందజేస్తారు.

జిల్లాలోని పోస్ట్ ఆఫీసులు

జిల్లాలో ప్రస్తుతం ఐదు సబ్ డివిజన్లున్నాయి. వాయల్పాడు, పీలేరు, మదనపల్లె, రాయ చోటిలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో ఈ ఎస్డీవో కార్యాలయాలు పనిచేస్తున్నాయి. వీటి పరిధిలో మొత్తం 46 సబ్ పోస్ట్ ఆఫీసులు, వాటి పరిధిలో 386 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు న్నాయి. వాయల్పాడు ఎస్డీవో పరిధిలో 9 సబ్ పోస్ట్ ఆఫీసులు, 66 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు, పీలేరు పరిధిలో 9 సబ్ పోస్ట్ ఆఫీసులు, 68 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు, మదనపల్లె పరిధిలో 8 సబ్ పోస్ట్ ఆఫీసులు, 72 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు, రాయచోటి పరిధిలో 9 సబ్ పోస్ట్‌ఆఫీసులు, 88 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు, రాజంపేట పరిధిలో 11 సబ్ పోస్ట్ ఆఫీసులు, 92 బ్రాంచి పోస్ట్ ఆఫీసులు పని చేస్తున్నాయి. ఇవి కాకుండా అర్బన్ ప్రాంతాల్లో టీఎస్‌ఓ కార్యాలయాలు న్నాయి. ఒక్కో సబ్ పోస్ట్ ఆఫీసు ద్వారా ప్రతి రోజూ వంద నుంచి 200 వరకూ రిజిస్టర్ పోస్టులు నమోదవుతున్నాయి.

ఆదాయ వనరుగా కూడా వుండాలి

- పవన్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, వాయల్పాడు

తపాలా శాఖ ఉనికి కొనసాగాలన్నా, మరింత బలోపేతం కావాలన్నా లాభప్రదమైన విధానం వుంటేగానీ జరుగదు. ఇంతవరకు అమల్లో వున్న రిజిస్టరు పోస్ట్ ధరలు అత్యంత కారు చవకగా ఉన్నాయి. పోస్టల్ శాఖకు ఈ విధానం గుదిబండగా వుంది. ఆధునిక సాంకేతికతను జోడించి విలువ ఆధారిత సేవలను అందించాలనే లక్ష్యంతో స్పీడ్ పోస్ట్‌ను పూర్తి స్థాయిలో అమల్లోకి తెస్తున్నాము. తపాలా సేవల్లో ఇదో గొప్ప విధానంగా భావిస్తున్నాము.

స్పీడ్ పోస్టు కొత్త ధరలు

స్పీడ్ పోస్టు కవరు బరువు, చేరాల్సిన దూరాన్ని బట్టి ధరలను నిర్ణయించారు. 50 గ్రాముల నుంచి 500 గ్రాముల వరకూ స్థానికంగా లేక రెండు వేల కి.మీ. దూరం పైబడి కూడా వివిధ రకాల దూరాన్ని బట్టి రూ.19 నుంచి గరిష్ఠంగా రూ.93 వరకూ చెల్లించాల్సి వుంటుంది. దీనికి జీఎస్టీ అదనం. ఉదాహర ణకు 250 నుంచి 500 గ్రా. బరువున్న కవరుకు స్థానికంగా అయితే రూ.28 చెల్లిం చాలి. అదే కవరు 200 కి.మి. వరకూ రూ.70, 500 కి.మీ వరకూ రూ.75, వేయి కి.మీ వరకూ రూ.82, రెండు వేల కి.మీ వరకూ రూ.86, అది దాటితే రూ.93లు మాత్రమే చెల్లించాల్సి వుంటుంది. ప్రైవేటు కొరియర్ సర్వీసులతో పోల్చుకుంటే స్పీడ్ పోస్ట్ ధరలు చాలా చౌకగా వున్నాయని చెబుతున్నారు. 500 గ్రా. (అర కిలో) బరువున్న స్పీడ్ పోస్ట్ కవరుకు 2 వేల కి.మీ. పైపడినా కేవలం రూ.93లుగా నిర్ణయించడం సామాన్యుడికి కూడా పెద్ద ఊరటగా చెబుతున్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దంగారి పల్లెకు చెందిన కార్తీక్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 23 నుంచి 25 వరకు కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరులో రాష్ట్ర స్థాయి అండర్-19 ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించగా, ఇందులో పాల్గొని ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేశారు. ఇతను ఛత్తీస్ ఘడ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన నున్నాడు. కాగా కార్తీక్‌ను వారి తల్లిదండ్రులు, కోచ్ మహేంద్రలు అభినందించారు.


విద్యార్థి కార్తీక్

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు.

కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా




ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్ల ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.




మహిషాసురమర్దినిగా చౌడేశ్వరీ మాత


దుర్గాదేవిగా నడి వీధి గంగమ్మను పూజిస్తున్న ప్రజలు


కమ్మగడ్డవీధిలో హోమం చేస్తున్న నిర్వాహకులు


దుర్గాదేవిగా మోడల్ కాలనీ ఎల్లమ్మ తల్లి


కలకడలో సరస్వతీదేవిగా చౌడేశ్వరి అమ్మవారు

కరుణా నిలయే నమోస్తుతే

దుర్గాదేవిగా రెడ్డెమ్మతల్లి

పీలేరులో రౌద్రాల అంకాలమ్మ

మాతమ్మకు కరెన్సీతో అలంకరణ

మదనపల్లెలో శోభాయమానంగా.....

'అయిగిరినందిని! నందితమేదిని! విశ్వవినోదిని! నందినుతే! - గిరివరవింధ్య శిరోధి నివాసిని! విష్ణువిలాసిని జిష్ణునుతే! - భగవతి! హే శితికంఠ కుటుంబిని! భూరి కుటుంబని భూరికృతే! - జయజయహే మహిషాసుర మర్ధిని రమ్యక పర్దిని శైలసుతే!' అంటూ ఆలయాలు భక్తి పాటలతో మార్మోగాయి. ఎక్కడ చూసినా అమ్మవారిని నుతిస్తూ అర్చకులు చేసిన ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తి శ్రద్ధలతో భక్తులు పాల్గొన్నారు.


దుర్గాదేవిగా పీలేరు రౌద్రాల అంకాలమ్మ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్ పురాణం చంద్రశేఖర్, బండి పవన్‌కుమార్, రామిశెట్టి రత్నమయ్య ఆధ్వర్యంలో మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు అనుగ్రహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు మోడెం సిద్దప్ప, ఉప్పు రామచంద్ర, నీలకంఠ, కొరమట్ల నాగరాజ, ఆర్‌కే మోహన్, కమలమరి కృష్ణ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు రామిశెట్టి అంజనేయులు, శీలం


కురబలకోటలో దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరీ

రమేష్‌బాబు పర్యవేక్షించారు. కోర్టులో గంగమ్మను మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, ఉపాధ్యక్షుడు కరుణాకర్ నాయుడు, ట్రెజరర్ మార్వ్రారి మహేష్ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. కన్యకా పరమేశ్వరీ దేవి మహిషాసురమర్ధిని ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్, ట్రెజరర్ సూరే గిరిధర్ పర్యవేక్షించారు. దేవళంవీధిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు, రాజరాజేశ్వరీ అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. దేవళంవీధిలోని ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో దసరా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ రమణ, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు పాండు, మార్వ్రారి సుధాకర్ నాయుడు, విశ్వబ్రహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ పర్యవేక్షించారు. బాట గంగమ్మ ఆలయంలో ధర్మకర్త బొగ్గిటి అలివేలమ్మ ఆధ్వర్యంలో మహిషాసురమర్ధిని అలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. ఈశ్వరమ్మ కాలనీలో, నీరుగట్టువారిపల్లెలోని తారక లేఅవుట్లో టీడీపీ యువ నేత ప్రభు గౌడ్, పరిమిళరెడ్డి దంపతులు కనక దుర్గ అమ్మవారిని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరికల్చర్ కాలనీలో నిర్వాహకులు పూజలు చేశారు.

కురుబలకోటలో దుర్గాదేవిగా...

కురబలకోట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరీ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నాగరాజగుప్త, రామకృష్ణ, బాలకృష్ణ సేతు మాధవ్, అమర్‌నాథ్, మారుతీ కుమార్, రామ్మోహన్, రాధారాణి, పుష్పలత, సరళ, అర్చకులు సత్యనారాయణ శర్మ పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో లక్ష్మీదేవిగా..

నిమ్మనపల్లి, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పెద్దహరిజనవాడలో వెలసిన మాతమ్మతల్లి లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని సుమారు ఐదు లక్షల మేరకు కరెన్సీతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఈ మొత్తం అమ్మవారి అలంకరణకు వాడి తిరిగి వారే తీసుకుంటారని కమిటీ తెలిపింది. కాగా ఏటా శ్రీరాములు అనే భక్తుడు ఒక్కరే అమ్మవారి అలంకరణకు కరెన్సీని ఇచ్చి తిరిగి తీసుకునే వారు ఈ ఏడాది ప్రత్యేకంగా గ్రామస్తులే ఈ ఏర్పాటు చేసుకున్నారని కమిటీ నిర్వాహకులు తెలిపారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు అన్నదానం చేపట్టారు.

ములకలచెరువులో దుర్గామాత...

ములకలచెరువు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు దుర్గామాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


ములకలచెరువులో దుర్గామాత....


రామసముద్రంలో తమలపాకుల అలంకరణ

పీటీఎం శివాలయంలో...

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో దుర్గామాతకు కుంకుమార్చన నిర్వహించారు. పంచామృతాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం అనంతరం అమ్మవారికి పంచ, సప్త, నక్షత్రహారతి ఇచ్చారు. సాయంత్రం ఆలయంలో దుర్గామాతను కొలువు దీర్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం చేశారు.


నిమ్మనపల్లిలో కరెన్సీతో....

తమలపాకుల అలంకరణతో...

రామసముద్రం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కన్యకాపరమేశ్వరి ఆలయంలో కన్యకాపరమేశ్వరి దేవిని తమలపాకులతో అలంకరించారు. అమ్మవారికి పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, పుష్పార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు అమ్మవారికి పలురకాల పిండి వంటలు, ఫల హారాలు సమర్పించారు.

తంబళ్లపల్లెలో దుర్గాదేవిగా...

తంబళ్లపల్లె, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కోదండ రామాలయం, శివాలయాల్లో పార్వతీ దేవి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఛైర్మన్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు మహేష్ అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

దుర్గాదేవిగా రెడ్డెమ్మ అమ్మవారు

గుర్రంకొండ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అమ్మవారు దుర్గాదేవిగా భక్తులను కటాక్షించారు. పోలేరమ్మ అమ్మవారు, తరిగొండ వాసవీ మాత ఆలయాల్లో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు. ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈఓ మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరులో దుర్గాదేవిగా....

పీలేరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ దేవత రౌద్రాల అంకాలమ్మ, ఇందిరమ్మ కాలనీ దిన్ని గంగమ్మ, బండ్లవంకలోని నడివీధి గంగమ్మ, మోడల్ కాలనీలోని ఎల్లమ్మ తల్లి, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లను పరిమళభరిత సుగంధ పుష్పాలతో అలంకరించారు. నవరాత్రుల్లో దుర్గాదేవి అలంకారం చాలా శక్తివంతమైనదని, ఈ అవతారంలో ఉన్న అమ్మవారిని ఆరాధిస్తే సద్గుతులు కలుగుతాయని, దుర్గామాత దర్శనం సకల శ్రేయోదాయకమని అర్చకులు భక్తులకు తెలియజేశారు. ఉలవల గంగమ్మ, తిరుపతి మార్గంలోని చౌడేశ్వరి దేవీ, అగ్రహారం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రౌద్రాల అంకాలమ్మ ఆలయంలో సాయంత్రం అర్చకులు మహిళలతో సామూహిక కుంకుమార్చన చేయించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆలయాల కమిటీ ఛైర్మన్‌లు కె.రామకృష్ణా రెడ్డి, దేవిరెడ్డి వెంకటరమణా రెడ్డి, రామిరెడ్డి, వెంకటమ్మ, శేఖర, ఈఓ మంజుల, సభ్యులు చంద్రారెడ్డి, వంశీ, మదనమోహన రెడ్డి, బాబు రెడ్డి, రఘునాథ్, షామియాన జయన్న, భాస్కర రెడ్డి, అర్చకులు చంద్రశేఖర శర్మ, ఆంజనేయులు, భరత్ స్వామి, గణేశ్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి దేవిగా కోన చౌడేశ్వరి...

కలకడ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కోనలో కొలువైన చౌడేశ్వరి దేవి సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

దుర్గాదేవిగా అలంకరణలు


వాల్మీకిపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అమ్మవారి దేవాలయాల్లో అలంకరణలు, పూజలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పట్టణంలోని నల్లవీరగంగా భవాని, కోనేటివీధిలోని లక్ష్మీకామేశ్వరస్వామి, బజారు వీధిలోని వాసవీ అమ్మవారు, వాల్మీకి నగర్‌లోని బోయకొండ గంగమ్మ, మండలంలోని గండబోయనపల్లె కోటలో వెలసిన సత్యమ్మతల్లి దేవత, చింతపర్తి వాసవీ కన్యకాపరమేశ్వరి, గొల్లపల్లెలోని విరూపాక్షమ్మతల్లి ఆలయాల్లో దుర్గాదేవి అలంకరణతో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గండబోయనపల్లె


దుర్గాదేవిగా నల్లవీరగంగాభవాని

సత్యమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వేడుకల్లో పాల్గొనగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ ఆయనను సత్కరించింది. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కంభం నిరంజ న్‌రెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ పులి సత్యారెడ్డి, సెక్రటరి చక్రపాణి, అర్చకులు ఉత్తన్నస్వామి, శీనా స్వామి, జనార్ధనస్వామి, యోగి స్వామి, భక్తులు పాల్గొన్నారు.

దుర్గాదేవిగా కలికిరి యల్లమ్మ తల్లి

కలికిరి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ దేవత యల్లమ్మ తల్లి దుర్గాదేవి అవతారంలో సాక్షాత్కరించారు. అమ్మవారికి ఇరువైపులా గర్జిస్తున్న సింహాలు, వెనుక వేప ఆకులతో అలంకారం, విగ్రహం చుట్టూ నిమ్మకాయల దండలతో ఇరుపక్కలా తోబుట్టువుల అండదండగా అమ్మవారు దర్శనమిచ్చారు.


దుర్గాదేవిగా కలికిరి యల్లమ్మ

కొత్త మార్కెట్‌కు స్థలాన్వేషణ


మార్కెట్ స్థలం కోసం రైతులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌ను పట్టణం బయటికి తరలించేందుకు స్థలాన్వేషన చేస్తున్నామని ఎమ్మెల్యే షాజహాన్ బాష అన్నారు. మంగళవారం ఆరోగ్యవరం వద్ద రెవెన్యూ అధికారులు, ఆరోగ్యవరం రైతులతో కలిసి ఎమ్మెల్యే పలు స్థలాలను పరిశీలించారు. పట్టణంలోని మార్కెట్ యార్డు 12 ఎకరాల్లో మాత్రమే వుండడంతో సీజన్‌లో ఎక్కువ టమోటాలు వచ్చినప్పుడు నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. ఈ విషయమై అసెంబ్లీలో తాను స్పీకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. ప్రభుత్వం కూడా మార్కెట్‌ను బయటికి తరలించేందుకు సముఖత వ్యక్తం చేసిందన్నారు. ఈ క్రమంలో ఆరోగ్యవరం వద్ద 52 ఎకరాలు రైతుల భూములను సేకరించేందుకు సర్వే చేయిస్తున్నామన్నారు. ఈ భూములు ఇచ్చేందుకు రైతులు కూడా సహకరిస్తే భవిష్యత్‌లో వారి భూములకు పదింతల విలువ పెరుగుతుందని సూచించారు. అంతే కాకుండా ఈ ప్రాంత రైతులు, ప్రజలకు అన్ని వసతులతో ఇళ్ల స్థలాలు, శ్మశానవాటిక కేటాయిస్తామన్నారు. రైతులకు న్యాయపర పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. మండల సర్వేయర్ సుబ్రమణ్యం, రైతులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

'మన ఓటును కాపాడుకుందాం'

ఓటు చోరీ ఉద్యమానికి సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న తులసిరెడ్డి, రెడ్డి సాహెబ్

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మన ఓటును మనం కాపాడుకుందామని ఎన్ తులసి రెడ్డి పిలుపునిచ్చారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా పట్టణంలోని బెంగళూరు బస్‌స్టాండ్, ఇందిరమ్మ సర్కిల్‌లో ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ ఈసీ, కేంద్ర ప్రభుత్వాలపై రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటు చోరీ వ్యతిరేక ఉద్యమానికి ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తన నియంతృత్వ పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తోందన్నారు. ఉన్న ఓట్లను గల్లంతు చేసి దొంగ ఓట్లను ఓట్ల జాబితాలోకి ఎక్కించి అధికారంలోకి వస్తోందని ఆరోపించారు. దీనిని అరికట్టడానికి రాహుల్‌గాంధీ చేస్తున్న ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కాంగ్రెస్ నేత రెడ్డి సాహెబ్ అన్నారు. ఈ నెల 15 నుంచి అక్టోబరు 15 వరకు సంతకాల సేకరణ ఉద్యమాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా, నేతలు మీనాకుమారి, ముబారక్, మహబూబ్‌పీర్, నాగరాజ, పాలేటి, రాజశేఖర్ నాయక్, భాను, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రౌద్రాల అంకాలమ్మ సేవలో ఎమ్మెల్యే


రౌద్రాల అంకాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నల్లారి

పీలేరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి మంగళవారం రౌద్రాల అంకాలమ్మ, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. అంకాలమ్మ ఆలయ పాలకమండలి అధ్యక్షుడు కోడి రామకృష్ణా రెడ్డి నేతృత్వంలో కమిటీ సభ్యులు, అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దుర్గాదేవి అలంకరణలో అంకాలమ్మను దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆయనకు అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం మండలం వ్యవసాయ శాఖాధికారి నీళ్ల మరిప్రసాద్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఏఎంసీ ఛైర్మన్ పురం రామ్మూర్తి, టీడీపీ నేతలు కోటపల్లె బాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, మల్లెల రెడ్డిబాషా, కోటపల్లె శ్రీనాథరెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, పురం రెడ్డమ్మ, శేఖర, భాస్కర రెడ్డి, వెంకటరమణా రెడ్డి, చంద్రలేఖ, రియాజ్, షౌకత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారి సేవలో...

నెహ్రూ బజారులో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని మంగళవారం రాత్రి ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన ఆయనకు ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆర్యవైశ్య, ఆర్యవైశ్య మహిళ, ఆర్యవైశ్య యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

లోక కళ్యాణం కోసం మహాదుర్గి హోమం


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాల్లో భాగంగా పట్టణంలో మంగళవారం అమ్మవారి ప్రతిమ ఎదుట మహాదుర్గి హోమం నిర్వహించారు. శాస్త్రోక్తంగా వేద మంత్రోచ్చారణతో పండితులు క్రతవును నిర్వహించగా వందలాది మహిళలు తిలకించారు. పండితుల సూచన మేరకు హోమ గుండంలో నైవేద్యం సమర్పించారు. అనంతరం పట్టణంలోని మార్వాడీ మహిళలు దుర్గామాతను స్తుతిస్తూ గానా, బజానా, భజన ఆకట్టుకుంది. సాయంత్రం దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని బైపాస్‌రోడ్డు, కరెంటుకాలనీ తదితర వీధుల నుంచి మహిళలు బారులు తీరి అమ్మవారికి కలశాలు సమర్పించుకున్నారు. నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నసంతర్పణ కొనసాగింది. వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుకున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కురవంక పంచాయతీలో తాగునీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు కొత్తబోరు డ్రిల్లింగ్ చేస్తున్నట్లు సర్పంచ్ చిప్పిలి చలపతి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం సరస్వతీనగర్, విజయనగర్ ప్రాంతాల మధ్య బోరు పాయింట్ పెట్టి పూజలు చేసి డ్రిల్లింగ్ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ రెండు ప్రాంతాల్లో 150 కుటుంబాలు నివసిస్తున్నాయని, రెండు వారాలుగా ఇక్కడ వున్న బోర్లలో నీటిమట్టం తగ్గిపోయిందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా కొత్తబోరు వేయిస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి మంజుల, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా శ్రీధర్‌కుమార్

వాల్మీకిపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల తిరుపతిలో జరిగిన ఎన్నికలో జిల్లా ఉపాధ్యక్షుడిగా వాల్మీకిపురం వాసి శ్రీధర్ కుమార్ నియమితులయ్యారు. 25 ఏళ్లుగా క్రికెట్ క్లబ్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక క్యాంపులు చేస్తూ, జిల్లాలో క్రికెట్ యాక్టివిటీస్ చేస్తున్న ఆయన సేవలను గుర్తించి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విజయకుమార్ అవకాశమిచ్చారు. శ్రీధర్‌కుమార్ మాట్లాడుతూ క్రికెట్ క్రీడాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు.

ఐదుగురు జూదర్ల అరెస్టు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బుక్కాలువ వద్ద ఆరుబయట పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ మహబూబ్ రఫీ దాడులు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి మూడు సెల్ ఫోన్లు, రూ. 1795 నగదును స్వాధీనం చేసుకుని, కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

టీడీపీ నేత మృతికి కల్పనారెడ్డి సంతాపం

బి.కొత్తకోట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట టీడీపీ సీనియర్ నేత శత్రుఘ్న కుటుంబానికి టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి సతీమణి, దానరిపల్లి కల్పనారెడ్డి సంతాపం ప్రకటించారు. మంగళవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె బి.కొత్తకోట చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. శత్రుఘ్న మృతి బి.కొత్తకోట టీడీపీకి తీరని లోటని అభిప్రాయపడ్డారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

అసమర్థ కౌన్సిల్‌తో అభివృద్ధి దూరం

మీడియాతో టీడీపీ కౌన్సిలర్ తులసి

మదనపల్లె, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ అసమర్థ కౌన్సిల్‌తో పట్టణ అభివృద్ధి నిలిచిపోవడమే కాదు, ప్రజలకు ఇబ్బదులు తప్పడం లేదని టీడీపీ 20 వార్డు కౌన్సిలర్ పి.తులసి ఆరోపించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సోమవారం నాటి కౌన్సిల్ సమావేశం ఎలాంటి చర్చ లేకుండా, అజెండాను వాయిదా వేసి ముగించడాన్ని ఆమె తప్పు పట్టారు. టీ, స్నాక్స్ కోసమే సమావేశం ఏర్పాటు చేసినట్లుందని ఆమె ఎద్దేవా చేశారు. ప్రజాసమస్యలపై చర్చించకుండా, అభివృద్ధి పనుల ప్రస్తావన లేకుండా, కొత్తగా చేపట్టబోయే పనులపై చర్చించరా? అంటూ ప్రశ్నించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోకుంటే వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కదిరి రోడ్డులోని ప్రశాంత్‌నగర్‌లో కాల్వ నిర్మాణానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాష చొరవ తీసుకుంటే, కౌన్సిల్‌లో వైసీపీ మెజార్టీ ఉందని పనులు అడ్డుకోవడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ప్రజల చేత ఎన్నుకుని ఉంటే ప్రజాసమస్యలు తెలిసేవని, ప్రతిపక్షాలు నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం, వేసినా చించేసి కౌన్సిలర్లు అయితే పాలన ఇలాగే ఉంటుందని దుయ్యబట్టారు. ప్రభుత్వం నుంచి పుష్కలంగా నిధులు వస్తుంటే వినియోగించుకోవడంలో వైఫల్యం చెందిన వైసీపీ కౌన్సిలర్లు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మల్లికార్జున

● ఎంఎస్పీ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్ ఎన్నిక


మల్లికార్జున


విజయ్‌కుమార్

ములకలచెరువు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల అధ్యక్షులుగా గంగిరెడ్డిపల్లి మల్లికార్జున, విజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ములకలచెరువులో మంగళవారం ఎంఎస్పీ జాతీయ నాయకుడు నరేంద్రబాబు మాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కమిటీల ఎన్నిక జరిగింది. ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడిగా తుడుం హరిబాబు, అధికార ప్రతినిధిగా కందుకూరు నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా పవీణ్, యువసేన అధ్యక్షుడిగా బాలినేని రవీంద్ర ఎన్నికయ్యారు. ఎంఎస్పీ గౌరవాధ్యక్షుడిగా తుడుం శ్రీరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మేకల పెద్ద ఆంజనేయులు, అధికార ప్రతినిధిగా బోనాసి రెడెప్ప ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రతాప్ కుమార్, ఇన్‌చార్జి తిరుపాల్, నేతలు వెంకటప్ప, చౌడప్ప, రామప్ప, పీటీఎం మండల అధ్యక్షుడు మబ్బు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకాన్ని సక్సెస్ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వన్ డిపో మేనేజరు వెంకటరమణారెడ్డి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకాన్ని సక్సెస్ చేయడానికి డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది కృషి చేయాలని వన్ డిపో డీఎం వెంకటరమణారెడ్డి కోరారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం విజయవంతం చేసినందుకు ఆర్టీసీ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో అభినంద లు తెలిపారన్నారు. జిల్లాలో ఎర్నింగ్స్, కేఎంపీఎల్, అధికంగా తెచ్చినందుకు డిపో ఉద్యోగులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఎస్,రవి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సప్లయ్ చానల్ మరమ్మతులు


గండ్లు పూడ్చివేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సేవాభారతి ఆధ్వర్యంలో అయ్యపునాయుని చెరువు సప్లయ్ చానల్ గండ్లు పూడ్చి మరమ్మతులు చేయించారు. పట్టణ సమీపంలోని పించానది నుంచి పట్టణ నడిబొడ్డున ఉన్న అయ్యపునాయుని చెరువుకు సప్లయ్ చానల్ ఉంది. అయితే చానల్ పలు చోట్ల పూడికతో పూడిపోవడం, అక్కడక్కడా గండ్లు పడడంతో చెరువు కు వచ్చే నీరు వృథాగా పోతోంది. దీనిని గుర్తించిన సేవాభారతి నేతలు మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో గండ్లు పూర్చి వేయడం, పలు చోట్ల పూడిక తీయించి నీరు చెరువులోకి వచ్చేలా పనులు చేయించారు. ఇందుకు అవస రమైన ఆర్థిక సాయం హిందూ ఐక్యవేదిక సభ్యులు అందించారు. రైతులు, పట్టణ ప్రజలు అభినందనలు తెలిపారు.





మేధో సంపత్తిని పెంపొందించుకోవాలి


విద్యార్థినిని సన్మానిస్తున్న రిటైర్డ్ గ్రూప్ కెప్టెన్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ డాక్టర్ పరంధామ గౌడ్, తదితరులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మేధో సంపత్తిని పెంపొందించుకోవాలని డాక్టర్ పరంధామ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం సంఘం ఫంక్షన్ హాల్‌లో పీవీకే ఫౌండేషన్ ఫౌండర్ మర్రిపాటి ఆధ్వర్యంలో 2025లో ప్రతిభ కనపర్చిన కురుబ విద్యార్థుల, ఉద్యోగుల ఆత్మీయ సన్మాన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో కురుబ విద్యార్థులు అత్యున్నత ప్రమాణాలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సామాజిక స్పృహతో సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్య, ఉద్యోగాల్లో ప్రతిభ కనపర్చిన 150 మందికి ప్రతిభ పురస్కారాలు అందించారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవి రమణ, డాక్టర్ చెన్నకేశవులు, రిటైర్డ్ డిగ్రీ అధ్యాపకులు ఆదినారాయణ, దండు రామాంజులు, వాల్మీకిపురం ఎస్ఐ చంద్రశేఖర్, గంగయ్య, రెడ్డెప్ప, కుమార్, మల్లికార్జున, బాలకర్ణ, సాంబశివ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



కుంట ఆక్రమణపై మహిళల ఫిర్యాదు


కిందికి వెళ్లిపోతున్న నీరు

పీలేరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కుంట ఆక్రమణ కారణంగా తమకు నష్టం కలుగుతోందని పెద్దకంబిరెడ్డిగారిపల్లె కాంతమ్మ, చంద్రమ్మ తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు దిగువ ఈదురు కుంటను కోమటి రమణ ఆక్రమించి పంటలు సాగు చేసుకుంటున్నాడన్నారు. ఈ విషయంపై మూడేళ్ల కిందటే తాము జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా వీఆర్వో, సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణ జరిగినట్లు ధృవీకరించారన్నారు. అయినా అతను ఆ భూమిలో పంటలు సాగుచేస్తూనే ఉన్నాడన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కుంట నిండడంతో తన పంట నీట మునుగుతుందని అతను కుంటకు గండి పెట్టడంతో నీళ్లన్నీ కిందికి వెళ్లిపోతున్నాయన్నారు. దీంతో అక్కడ ఉన్న తమ భూముల్లో నీరు చేరుతున్నాయన్నారు. ఈ విషయమై అతన్ని నిలదీయగా తమపై దౌర్జన్యం చేశాడని ఆరోపించారు. అతని చెర నుంచి కుంటను కాపాడి తమకు న్యాయం చేయాలని కోరారు.



'దోచింది కొండంత... ఇచ్చింది గోరంత'

గుర్రంకొండ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధానంతో ప్రజల నుంచి లక్షలకోట్లు దోచుకుని సంస్కరణల పేరుతో పైసలను విదిల్చిందని కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. గుర్రంకొండలో ఆపార్టీ నేతలతో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా జీఎస్టీ పేరుతో ప్రజల నుంచి లక్షలాది కోట్లను కొల్లగొట్టిందన్నారు. ఈ నిధుల నుంచి కొంత మొత్తాన్ని సంస్కరణల పేరుతో తగ్గించి పేదలకు న్యాయం చేసినట్లు గొప్పలు చెబుతోందన్నారు. నిత్యావసరాల ధరలు ఏ మాత్రం తగ్గలేదన్నారు. వ్యాపారులు తగ్గిన వస్తువులను ధరల బోర్డులను ఏర్పాటు చేయడం లేదని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలను కూడా జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నసీరుద్దీన్, గౌస్‌బాష, ఖాజా, హర్షద్, షామీర్, అమరనాథ్‌రెడ్డి, చలపతి, రమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.









